క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన

గంగవరం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులు గురువారం పర్యటించనున్నట్టు నాయకుడు తోట రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని నెల్లిపూడి సచివాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

రాజవొమ్మంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు జరగనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు హాజరుకానున్నట్టు మండల పార్టీ కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఆత్మీయ వీడ్కోలు



సీఐ స్వామినాయుడును సన్మానిస్తున్న రాజులమ్మ తదితరులు

కొయ్యూరు: ఇటీవల బదిలీపై రాజవొమ్మంగి వెళ్లిన సీఐ స్వామినాయుడును చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ బుధవారం సన్మానించారు. ఆమెతో పాటు ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు గంగాధర్, రామరాజు తదితరులు కలిసి సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

అలరించిన బాలికల నృత్యాలు



డ్యాన్స్ చేస్తున్న బాలికలు

కొయ్యూరు: రాజేంద్రపాలెం బాలికల పాఠశాలలో బుధవారం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గోపాలరావు మాట్లాడుతూ బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. మేట్రిన్ సుజ్ఞానరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి, కితలంగి, గసభ, సొవ్వ పంచాయతీల్లో బుధవారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ మాట్లాడుతూ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రైతులు పశువులకు టీకాలు వేయించుకోవాలని ఆమె సూచించారు. పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది త్రినాథరావు, సుబ్బారావు, సంజీవ్, అనంతరావు, అప్పారావు, రాజు, మనోజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు



పథకాల కార్డులు చూపుతున్న గ్రామస్తులు, సర్పంచ్ తదితరులు

కొయ్యూరు: అంతాడ పంచాయతీ గంపరాయి లో బుధవారం పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని సర్పంచ్ సుర్ల చంద్రరావు, బీజేపీ నేత చంద్ర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పథకం ద్వారా ఆదివాసీలకు గృహాలు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేస్తున్నట్టు తెలిపారు. బ్యాంకు ఖాతాలు చేయించడం వంటి సేవలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్జున్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లీలా ప్రసాద్, వలంటీర్లు కన్నబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె చెంతకే వైద్యం

- నిర్మాణంలో హెల్త్ క్లినిక్ భవనాలు
- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు





చిలకలగెడ్డలోని పూర్తయినా హెల్త్ క్లినిక్...

పనులు జరుగుతున్న కొత్తూరు హెల్త్‌వెల్‌నెస్ సెంటర్

నియోజకవర్గంలోని హెల్త్ క్లినిక్‌ల వివరాలు	
మండలం	మంజూరైనవి
అనంతగిరి	14
అరకు	08
డుంబ్రిగుడ	13
హుకుంపేట	18
పెదబయలు	09
ముంచంగిపుట్టు	16

అనంతగిరి: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. పల్లె ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో అధికారం చేపట్టిన నాటి నుంచే పలు సంస్కరణలను శ్రీకారం చేపట్టారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని హెల్త్ క్లినిక్‌లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే కొన్ని గ్రామాలో హెల్త్ క్లినిక్‌ల కోసం భవన నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా, మిగిలిన గ్రామాల్లో భవనాల నిర్మాణానికి స్థల సేకరణ జరుగుతుంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తరచూ వెల్‌నెస్ కేంద్రాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి, భవనాల అందుబాటులోకి తేచ్చే విధంగా ప్రభుత్వం కూడా చర్యలు చేపడుతుంది.

వైద్య సేవలే లక్ష్యం

ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. 108, 104 వాహనాలను ప్రతి మండలానికి అందజేసింది. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో వైద్య సేవలను పల్లెలకు మరింత చేరువకానున్నాయి. విలేజ్ క్లినిక్ ద్వారా 24 గంటలూ వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ముఖ్యంగా 54 రకాల మందులు, అన్నివేళలా క్లినిక్‌లు అందుబాటులోని రానున్నాయి. గర్భిణులకు నెలవారీగా వైద్య పరీక్షలు ఈ కేంద్రాల ద్వారానే అందించేలా ప్రణాళికలు రుపొందిస్తున్నారు. ఒక్కో హెల్త్ క్లినిక్‌కు రూ. 20.80 లక్షలతో నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ భవన నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి.

ఆనందంగా ఉంది



గిరిజనుల చెంతకే ప్రభుత్వం కార్పొరేట్ వైద్యాన్ని తీసుకొచ్చింది. ప్రజారోగ్యమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఈమేరకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో చాలా సంతోషంగా ఉంది. దీంతో అందరికీ మెరుగైన వైద్యం అందుతోంది. సీఎం జగనన్నకు గిరిజనలందరూ రుణపడి ఉంటాం.

– జన్ని సన్యాసిరావు, సర్పంచ్, లంగుపర్తి

త్వరితగతిన పూర్తి చేస్తాం



వైఎస్సార్‌హెల్త్ క్లినిక్ సెంటర్లు త్వరితగతిన పూర్తిచేసేవిధంగా చర్యలు చేపడుతున్నాం.. పనులు వేగవంతం చేయాలని, కాంట్రాక్టర్లకు ఆదేశించాం. ఇప్పటికే చిలకలగెడ్డలో హెల్త్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, గడవులోగా పూర్తి చేయాలని సూచించాం. శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

– సాయివిజయ్, ఏఈ పీఆర్

సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజవొమ్మంగి: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పాడేరులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండంలోని ఎన్‌హెచ్–516 రహదారి పనుల్లో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు పరిహారం అందజేయాలని, జడ్డంగి–చిన్నయ్య పాలెం మీదుగా సింగంపల్లికి రోడ్డు నిర్మించాలని వినతిలో కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో అరకు ఎంపీ మాధవిని కూడా కలసి సమస్యలను వివరించామన్నారు. జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, నాయకుడు కామేష్ తదితరులున్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

రావికమతం: సారాతో గుడ్డిప గ్రామానికి చెందిన గల్లా కృష్ణంనాయుడు అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్టు రావికమతం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. గుడ్డిపలో సారా విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు చెప్పారు. నిందితుడి నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా వన సమారాధన



పి.యర్రగొండలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, గురుకుల బాలికల జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల రాజేశ్వరి, మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు, నాయకులు తమ్మిరెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీపీతోపాటు పలువురు మాట్లాడుతు ఏకలవ్య పాఠశాలను, గురుకుల బాలికల జూనియర్ కళాశాలను సన్మార్గంలో నడిపిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణను అభినందించారు.విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, మంచి చదువులు చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సావిత్రిభాయిపూలె జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఏకలవ్య పాఠశాల, గురుకుల కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రమదానంతో బ్రిడ్జి ఏర్పాటు



కుంబిడిసింగిలో గెడ్డపై తాత్కాలికంగా బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్న గిరిజనులు

జి.మాడుగుల: మండలంలో మత్స్యపురం–కుంబిడిసింగి రోడ్డు మార్గంలో గల గెడ్డపై స్థానికులు బుధవారం శ్రమదానంతో గెడ్డపై తాత్కాలిక బ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఈ మార్గంలోని గెడ్డపై బ్రిడ్జి కోసం పలుమార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదని పలువురు చెప్పారు. కుంబిడిసింగి రోడ్డు మార్గంలో గెడ్డపై శ్రమదానంతో తాత్కాలికంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు తదితర వాహనాలు రాకపోకలు అనువుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు.

పేదలకు వరం జగనన్న ప్రభుత్వ పథకాలు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీటీసీ వెంకట రామిరెడ్డి

ఎటపాక: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు వరంలా మారాయని గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి అన్నారు. పురుషోత్తపట్టణంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాల మెరుగుపరుస్తున్న విధానాలను వివరించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి జగనన్న చేపడుతున్న చర్యలను ఆయన అభినందించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత మన ప్రభుత్వానిదేనని చెప్పారు. సర్పంచ్ బుద్దా ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దామెర్ల రేవతి, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు



బంగరుబుడిలో క్రీడాకారులకు నగదు బహుమతి అందిస్తున్న ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా గిరిజన యువత ఉత్తమ ప్రతిభను కనపరిచాలని ఎంపీపీ కూడా రాజుబాబు అన్నారు. మండలంలోని జర్రకొండ పంచాయతీ బంగారుబుడి గ్రామంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ నేపథ్యంలో పోటీలో విజేతలకు నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గిరిజన యువత జాతీయ అంతర్జాతీయ స్థాయిలోనీ క్రీడల్లో ప్రతిభను కనపరిచాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్ చిట్టిబాబు, మండల పార్టీ యువజన విభాగ కార్యదర్శి వెంకట్, నాయకుడు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి



మహిళలకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గంగవరం : గర్భిణీలు, బాలింతలు మంచి ఆహారాన్ని తీసుకోవాలని, తగిన ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని పీహెచ్‌సీ వైద్యురాలు భావన చెప్పారు. వ్యాక్సినేషన్ డే సందర్భంగా స్థానిక రాజరాజేశ్వరి ఆలయం ఆవరణలో (మధ్యవీధి)లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంటిపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, బాలింతలు, గర్భిణులకు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించారు. హెల్త్ విజటర్ విజయలక్ష్మి, ఏఎస్‌ఎంలు సుబ్బలక్ష్మి, పద్మప్రియ, ఆశ కార్యకర్త రామాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆరోగ్య సురక్ష శిబిరాలు

గంగవరం: మండలంలోని గ్రామ సచివాలయల్లో ఈనెల 5 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు రెండు విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఓ.భావన తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 5న కొత్తాడ గ్రామ సచివాలయంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 12న మోహనాపురం, 19న మొల్లేరు, 23న నెల్లిపూడి, ఫిబ్రవరి 2న మర్రిపాలెం, 6న లక్కొండ, 13న జగ్గంపాలెం, 20న జడేరు గ్రామాల్లో ఆరోగ్య వైద్యశిబిరాలు నిర్వహించునున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతలు



అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు



జి.మాడుగులలో అక్షింతలు పంపిణీ చేస్తున్న మత్స్యరాజు

రాజవొమ్మంగి: ఆయోధ్య నుంచి వచ్చిన అక్షితల పంపిణీ కార్యక్రమం బుధవారం మండల కేంద్రం రాజవొమ్మంగిలో ప్రారంభమైంది. అక్షింతలతో పాటు ఈ నెల 22న ఆయోధ్యలో నిర్వహించనున్న బాలరాముని విగ్రహ ప్రతిష్ట తదితర వివరాలతో కూడిన కరపత్రాలు, అయోధ్య రామాలయం చిత్రపటాన్ని అందజేశారు. ప్రతి ఇంటికి అక్షింతలు చేరవేస్తున్నట్టు భక్తజన బృంద సభ్యులు తెలిపారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలో ప్రతీ ఇంటికి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను బుధవారం సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా పరియోజన కార్యదర్శి మత్స్యరాస మత్స్యరాజు పంపిణీ చేశారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

ఎటపాక: మండలంలోని నల్లకుంట గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంపీపీ కాక కామేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు ప్రగతిని తెలుసుకున్నారు. మెనూ అమలుతీరుపై ఆరా తీశారు. భోజనం తయారీలో నాణ్యత, పరిశుభ్రత పాటించాలని హెచ్‌ఎం సీతారాములకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రభుత్వం విద్య కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఆశ్రమ పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఒత్తిడితో మానసిక సమస్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య బృందం

చోడవరం రూరల్: విద్యార్థి దశలో తీవ్ర ఒత్తిడికి గురైనట్టయితే మానసిక సమస్యలకు దారితీస్తుందని సైకాలజిస్టు ఏ.మధులత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ మూడు యూనిట్ల విద్యార్థులకు జిల్లా మానసిక ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో మానసిక వికాస సదస్సు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మధులత మాట్లాడుతూ మనసును అదుపులో ఉంచుకుని, మంచి మార్గంలో నడచుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమన్నారు. మానసిక ఆరోగ్య కార్యకర్త జి.సాయిలక్ష్మి, సమన్వయకర్త జి.సత్యనారాయణ, ఉపన్యాసకులు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు పిచ్చమ్మ, రత్నభారతి, డి.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాణిక్యాలరావు తదితరులు

గంగవరం : పెద్దఅడ్డపల్లి గ్రామంలో క్రీస్తు సంఘం చర్చిలో విశ్రాంత సర్వేయర్ మాణిక్యాలరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, ఆర్‌ఐ జిలానీ, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి దిండి బాబి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీరలను మాణిక్యాలరావు ఆర్ ఐ జిలానీ, వీఆర్వోలు రవికుమార్, వెంకటేశ్వర్లుదొర, డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు రాణియమ్మ తదితరులు పంపిణీ చేశారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి



రాజవొమ్మంగిలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తదితరులు



అనంతగిరిలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం మంగమ్మ, సిబ్బంది

రాజవొమ్మంగి: స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయని, సామాజిక కార్యకర్తగా సావిత్రిబాయి పూలే అందించిన సేవలు ఎనలేనివన్నారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సమాజానికి చేసిన సేవలను పిల్లలు వివరించారు. సావిత్రిబాయి పూలే మహిళా అభ్యుదయానికి ఎనలేని కృషి చేశారన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలోని బాలికల–2 పాఠశాలలోని బుధవారం హెచ్‌ఎం మంగమ్మ ఆధ్వర్యంలోని సాయిత్రిబాయిపూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



విద్యార్థులకు పలకలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ భాగ్యవతి

ముంచంగిపుట్టు: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని జర్రెల సర్పంచ్ నాయకం భాగ్యవతి అన్నారు. మండలంలో గల బాబుశాల పంచాయతీ మత్స్యపురంలో పేద విద్యార్థులకు సర్పంచ్ భాగ్యవతి తన సొంత సొమ్మును వెచ్చించి 90 మందికి పలకలు,పుస్తాకాలను ఉచితంగా బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాన్నారు. నాయకులు సురేష్, అప్పారావు, మాజీ సర్పంచ్ కేశవరావు, ఆనందరావు,డొంబురు, రామారాజు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీలకు శిక్షణ

కొంకోట: గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలను లక్షాధికారులను చేసి, వారి కుటుంబాల అభ్యున్నతికి అనుసరించాల్సిన మార్గాలపై సీఆర్‌పీలకు బుధవారం శిక్షణ నిర్వహించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని స్వయం సహాయక సంఘాల సీఆర్‌పీలకు వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు పలు అంశాలపై మెలకువలను వివరించారు. స్త్రీనిధి మేనేజర్ వెంకటరమణ, ఎల్‌సీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్వహణపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ నాయుడు

రావికమతం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న తీరు, అక్కడి యజమానులెవరన్న దానిపై నర్సీపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ఎస్. నాయుడు బుధవారం విచారణ చేశారు. ప్రయాణికులు ఎవరూ రావడం లేదన్న కారణంతో ఆర్టీసీ కాంప్లెక్స్ భవనాన్ని రావికమతంలో కోకాకోలా వ్యాపారికి పదేళ్ల కిందట అద్దెకిచ్చారు. అయితే లీజు అగ్రిమెంట్ ఉల్లంఘించారని, వేరే వ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదు మేరకు నాయుడు బుధవారం రావికమతం వచ్చి ఆ స్థలంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి వివరాలు,అసలైన అగ్రిమెంట్ దారుడు ఎవరన్న దానిపై ఆరా తీశారు. నివేదికను డిపోమేనేజర్‌కు అందించి, తగిన చర్యలు చేపడతామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.